
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

శుక్రవారం 7 మార్చి 2025



	ఇఫ్తార్	సెహరి
	శుక్రవారం	శనివారం
కర్నూలు	6: 32	5:10
నంద్యాల	6: 28	5:10



విశేష అలంకరణలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి



హంస వాహనంపై జ్వాలా నరసింహస్వామి



దిగువలో సింహ వాహనంపై దర్శనమిస్తున్న ప్రహ్లాదవరదస్వామి

- దిగువ అహోబిలంలో ధ్వజారోహణం
- సింహ వాహనంపై విహరించిన నృసింహుడు
- వైభవంగా సాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు

దేవతలారా రండి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ అర్చకులు ధ్వజపటావిష్కరణ, బేరి పూజ నిర్వహించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్‌లు దిగువ అహోబిలంలో వేకువజామున ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభంపై గరుత్మంతుడి చిత్రపటాన్ని ఆవిష్కరణ చేశారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించి శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రహ్లాదవరదస్వామిని సింహవాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కాగా దిగువ అహోబిలంలో శుక్రవారం శ్రీవారు హంస, సూర్యప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

హంస వాహనంపై నారసింహుడు

ఎగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత నారసింహస్వామికి గురువారం రెండు వాహన సేవలు నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. జ్వాలా నరసింహస్వామి ఉదయం హంస వాహనం, రాత్రి సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాడవీధుల్లో శ్రీవారి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు శుక్రవారం హనుమంత వాహనంపై విహరించనున్నారు.



దిగువ అహోబిలంలో ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆస్తి పన్ను వసూళ్లలో రెండో స్థానం

కర్నూలు న్యూసిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రంలో నగర పాలక సంస్థ రెండో స్థానం సాధించిందినట్లు అధికార వర్గాలు తెలిపారు. మొదటి స్థానం మంగళగిరి-తాడేపాల్లికి నగర పాలకకు దక్కింది. 2023-2024 సంవత్సరానికి ఆస్తి పన్ను రూ.61 కోట్లు వసూలు చేయగా ప్రస్తుతం 2024-2025 సంవత్సరానికి మార్చి 6 నాటికి రూ.55 కోట్లు వసూలు చేశారు. దీంతో 13.70 శాతం గత సంత్సరం కంటే ఎక్కువగా వసూలు చేశారు. మొత్తం రూ.113.75 కోట్లు ఉండగా ఇప్పటి వరకు 48 శాతానికి పైగా పన్ను వసూలు చేశారు. ఇంకా 24 రోజులు ఉంది. గత సంవత్సరం మార్చి 6 వరకు రూ.48.58 కోట్లు వసూలు చేయగా ఈ సంవత్సరం మార్చి 6 వరకు రూ.55.16 కోట్లు వసూలు చేశారు. ఒక్కరోజులోనే రూ.31 లక్షలు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

679 మంది విద్యార్థులు గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని 53 కేంద్రాల్లో గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల్లో 679 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ సునీత తెలిపారు. మ్యాథ్స్, బోటనీ, సివిక్స్ పరీక్షలకు 15,583 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 15,015 మంది హాజరయ్యారు. అలాగే వొకేషనల్ విద్యార్థులు 1,529 మందికిగాను 1,418 మంది పరీక్షలు రాశారు.

'రుద్రవరం' అవినీతిపై షోకాజ్ నోటీసులు

- చర్యలకు మరో వారం రోజులు గడువు
- మరో ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్‌తో పాటు రికవరీకి ఆదేశం
- కలెక్టర్ ఉత్తర్వులు జారీ

నంద్యాల, మార్చి6(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై నలుగురు పంచాయతీ కార్యదర్శులతో పాటు సర్పంచ్‌ను బాధ్యులు చేస్తూ వారికి కలెక్టర్ రాజకుమారి షోకాజ్ నోటీసులు గురువారం జారీ చేశారు. పంచాయతీలో జరిగిన అక్రమాలపై డీఎల్‌పీఓ రాంబాబు అందించిన నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నారు. శిరివెల్ల మండలం యర్రగుంట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష్‌బాబు ప్రభుత్వం అందించే పింఛన్ అమౌంట్ రూ.8.48 లక్షలు సొంతానికి వాడుకుని అప్పట్లో నకిలీ రశీదులు అందజేశారనే ఆరోపణపై విచారణ చేయగా.. అసలు గుట్టు బయటపడింది. వెంటనే సదరు కార్యదర్శి శిరీష్‌బాబును సస్పెండ్ చేసి, డబ్బు రికవరీకి ఆదేశించారు. గడివేమల మండలం పెసరవాయి గ్రామంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి సుధీర్‌నందకుమార్ సైతం గతంలో బండి ఆత్మకూరు మండలం మిడుతూరు గ్రామంలో పనిచేసే సమయంలో ఇంటి గుత్తలకు సంబంధించి రూ. 3.25లక్షలు ప్రభుత్వానికి చెల్లించకుండా దుర్వినియోగం చేశారనే ఆరోపణ ఎదుర్కొన్నారు. ఆ తర్వాత ఆయన విడతల వారిగా రూ. 2.25 లక్షలు చెల్లించారు. మిగిలిన రూ.1లక్ష చెల్లించకపోవడంతో సదరు కార్యదర్శిని కూడా సస్పెన్షన్ చేయడంతో పాటు రికవరీకి ఉత్తర్వుల్లో కలెక్టర్ ఆదేశించారు.



రైతులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో రైతు సాధికారిక సంస్థ - ప్రజా భాగస్వామ్యం ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులవల్ల భూమి సారం పోవడమే కాకుండా మానవుల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని అన్నారు. జిల్లాలోని 1633 అంగన్‌వాడీ కేంద్రాలు, 86 సంక్షేమ వసతిగృహాల ఆవరణలో ఆకుకూరలు పెంచి ఆహారపదార్థాల్లో వినియోగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు, జిల్లా పట్టుపరిశ్రమల అధికారి పరమేశ్వరి, కేవీకే సైంటిస్ట్ బాలరాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత లక్ష్యాలపై దృష్టి సారించండి

మహిళా సాధికారతకు నిర్దేశించిన లక్ష్యాలపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ద్వారా అమలయ్యే కార్యక్రమాల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అమలవుతున్న అన్ని పారామీటర్ల సంక్షేమ పథకాల లక్ష్యసాధనలో దృష్టి పెట్టాలని ఏపీఎం, సీసీలను ఆమె ఆదేశించారు.

నిరుద్యోగం పెరిగేకొద్దీ మోసగాళ్లు కొత్త వేషాలతో ముందుకు వస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని... అమేజాన్ కంపెనీలో ఆఫర్ వచ్చిందని.. అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా చాన్స్ ఇప్పిస్తామని, రైల్వేశాఖలో పెద్ద పోస్టు ఉందని, మీ కోసం కోర్టుల్లో జాబ్స్ ఉన్నాయని నమ్మించి నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. అమాయక నిరుద్యోగులను మోసం చేస్తూ భారీ ఎత్తున నగదును కాజేస్తున్న ఉదంతాలు నిత్యం జరుగుతున్నాయి. బిడ్డలను కష్టపడి చదివించిన తల్లిదండ్రులు మరోసారి ఇలాంటి దళారుల మాటలు నమ్మి తమ కష్టార్జితాన్ని ధారపోస్తున్నారు. ఏదో ఒక ఉద్యోగం వస్తే పిల్లలు స్థిరపడతారనే ఆశతో వంచకుల వలలో పడుతున్నారు. ఈ సెగ పోలీసు శాఖకు సైతం చేరింది. ఉద్యోగాల ఇప్పిస్తామని ఎవరూ నమ్మి డబ్బులు ఇవ్వద్దంటూ పలు కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నా.. నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు మాత్రం మాయగాళ్ల మాటలను మోసపోతున్నారు.





ముంచుతున్న మోసగాళ్లు

- అనేక మంది నుంచి రూ.లక్షల్లో స్వాహా
- ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదులు
- నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలంటున్న ఎస్పీ

కర్నూలు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కోసం మాయ మాటలు నమ్మి, డబ్బు ఇచ్చి మోసపోతున్న వాళ్లు ఎస్పీ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్నారు. ప్రతి సోమవారం కనీసం 9 నుంచి 10 దాకా ఫిర్యాదులు ఈ తరహా మోసాలపైనే ఉంటున్నాయి. కింది స్థాయి ఇచ్చిన పోలీస్ స్టేషన్‌లలో తాము ఇచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపకపోవడంతోనే బాధితులు ఎస్పీని ఆశ్రయిస్తున్నారు. ఎస్పీ వద్దకు వచ్చిన ఫిర్యాదుల్లో కూడా కొన్నింటికి మాత్రమే పరిష్కారం దొరుకుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ రైతు కుటుంబాలకు చెందిన వారే ఎక్కువగా ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నట్లు ఇటీవల సంఘటనలను బట్టి చూస్తే తెలుస్తున్నది. నోటిఫికేషన్లు ఇచ్చిన తర్వాతనే ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు వస్తాయని అధికారులు చెబుతున్నా.. కొందరు ఇట్లా మోసపోతూనే ఉన్నారు.

నమ్మి మోసపోవద్దు

ప్రభుత్వ, ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తారు. కానీ కొందరు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశ చూపిస్తారు. బాగా తెలిసిన వ్యక్తులే నమ్మిస్తారు.. ఆ తర్వాత మొఖం చాటేస్తారు. అటు ఉద్యోగం రాక.. ఇటు డబ్బులు రాక పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, బ్యాంకు ఉద్యోగాలు, కోర్టు, రైల్వే ఉద్యోగాలంటూ మోసం చేస్తున్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు అడిగితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

ఇటీవల వచ్చిన కొన్ని ఫిర్యాదులు

- రూ.3.50 లక్షలు తీసుకుని అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ సొసైటీలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నమ్మించి వెంకటాపురం చెందిన శేఖర్, సుధాకర్ మోసం చేశారని దేవరకొండ మండలం, బేతపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 17న ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- కర్నూలు చెందిన వీరాస్వామి అనే వ్యక్తి రూ.8 లక్షలు, 5 తులాల బంగారు తీసుకుని హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసం చేశాడని ఆర్‌కే స్ట్రీట్‌కు చెందిన నాగరాజు అనే వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.
- కర్నూలు కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అనంతపురానికి చెందిన సాదిక్ వలి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు విద్యానగర్‌కు చెందిన సందీప్ చంద్రపాల్ ఫిబ్రవరి 10న ఎస్పీని ఆశ్రయించాడు.

మిగతా 6వ పేజీలో

అసెంబ్లీకి చేరిన గుండ్రేవుల

- చర్చకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరిన ఎమ్మెల్యే గౌరు చరిత
- నివేదిక కోరిన శాసనసభ సెక్రటరీ జనరల్





తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మాణం కోసం ప్రతిపాదించిన ప్రాంతం

కర్నూలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గుండ్రేవుల జలాశయం అంశం అసెంబ్లీకి చేరింది. రాయలసీమ ప్రజల ప్రాణాధారమైన ఈ ప్రాజెక్టుపై చర్చకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని విన్నవించారు. ఆమె విజ్ఞప్తిని స్వీకరించిన స్పీకర్ ప్రశ్న నంబరు.802 కింద చర్చించేందుకు ఆమోదం తెలిపారు. గుండ్రేవుల ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర శాసనసభ సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర జలవనరుల శాఖ అధికారులను కోరారు. పూర్తి వివరాలతో జిల్లా ఇరిగేషన్ ఇంజనీర్లు నివేదిక పంపారు. అసెంబ్లీ సాక్షిగా గుండ్రేవులపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే అవకాశం ఉందని సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. 2019 ఫిబ్రవరి 21 అప్పటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్ రాష్ట్ర సమస్య అంటూ అటకెక్కించారు.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల సహా కడప జిల్లాల్లో కేసీ కాలువ కింద 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కేడబ్ల్యూడీటీ-1 (బచావత్ అవార్డు) మేరకు 31.90 టీఎంసీల నీటివాటా ఉంది. అందులో 10 టీఎంసీలు తుంగభద్ర జలాశయం నుంచి తీసుకోవాల్సి ఉంటే.. 21.90 టీఎంసీలు తుంగభద్ర నదీప్రవాహం ద్వారా తీసుకోవాలి. అయితే ఏటేటా తుంగభద్ర వరద రోజులు తగ్గిపోతుండడంతో కేసీ కాలువ చివరి ఆయకట్టు, రబీ ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. అదే క్రమంలో కర్నూలు నగర ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం సుంకేసుల జలాశయం ఫోర్‌షోర్ ఏరియాలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మించడం వల్ల వేసవిలో నీటి కష్టాలు మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో సుంకేసుల జలశయం ఎగువన సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామం సమీపంలో తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో 'గుండ్రేవుల జలాశయం' నిర్మించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. రాయలసీమ సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఇంజనీరు సుబ్బరాయుడు ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేసి సమగ్ర వివరాలతో 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వానికి నివేదిక పంపారు. స్పందించిన కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వే, డీపీఆర్ తయారీ కోసం రూ.54.95 లక్షలు నిధులు మంజూరు చేస్తూ 2013 నవంబరు 1న జీవో ఎంఎస్ నంబరు.100 జారీ చేశారు. హైదరాబాదుకు చెందిన ఆర్వే అసోసియేట్స్ సంస్థ ప్రాజెక్టుపై అధ్యయనం చేసి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) ఇచ్చారు.

మిగతా 6వ పేజీలో

ముంచుతున్న మోసగాళ్లు

(5వ పేజీ తరువాయి)



- డిల్లీకి చెందిన ఆశా ఠాకూర్ అనే వ్యక్తి తన కొడుకు సురేష్‌కు కెనడాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి పంపిస్తామని ఫీజుల పేరుతో రూ.1.6 లక్షలు కట్టించుకుని మోసం చేశాడని కర్నూలు వెంకటరమణకాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు.
- బెంగుళూరుకు చెందిన మనీషా జాబ్ కన్సల్టెన్సీ అనే సంస్థ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.3 లక్షలు తీసుకుని కర్నూలు ఎన్‌ఆర్‌పేటకు చెందిన సమీర్ ఫిబ్రవరి 3న ఫిర్యాదు చేశారు.
- హైదరాబాదులో గుడ్‌క్రాఫ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన చంద్రశేఖర్ నాయుడు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.2.60 లక్షలు తీసుకుని 3 నెలల పాటు పని చేయించుకుని జీతం లేకుండా, అసలు ఉద్యోగమే ఇప్పించకుండా మోసం చేశాడని కర్నూలు పార్వతీనగర్‌కు చెందిన కురువ అంజనేయులు, ఈశ్వర్ ఫిబ్రవరి 3న ఎస్పీని ఆశ్రయించారు.
- కర్నూలుకు చెందిన హసీనా బేగం, మహబూబ్ బాషా కలిసి కర్నూలులోని మద్దూరునగర్‌లో జాబ్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారని, బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.1.80 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు ఎల్బీఎస్ నగర్‌కు చెందిన వీర అరుణ్ కుమార్ అనే వ్యక్తి జనవరి 20 ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు.

గత ఏడాది చివరి మూడు నెలల్లో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- బెంగుళూరు చెందిన ఒరిజిన్ ఇన్ఫో టెక్నాలజీ కియోన్క్స్ కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి హైదరాబాదులో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్, రాకేష్, అశ్విని, కిరణ్ కుమార్ కలిసి మోసం చేశారని కర్నూలు ముజఫర్‌నగర్‌కు చెందిన ప్రసన్నలక్ష్మి డిసెంబరు 2న ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తనను నమ్మి 25 మంది రూ.50లక్షలు దాకా ఇచ్చారని, 2నెలల పాటు బెంగుళూరులో జీతాలు ఇచ్చి కంపెనీలు తీసివేసి మోసం చేశారని ఆమె తెలిపారు.
- డిసెంబరు 9న కర్నూలు రేడియో స్టేషన్‌లో అటెండరు ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలుకు చెందిన చంద్రశేఖర్, శ్రీకాంత్ రూ.18లక్షలు తీసుకుని మోసం చేశారు.
- ఎదురూరు గ్రామానికి చెందిన శివకుమార్, జోహరాపురానికి చెందిన శ్రీనివాసులు రైల్వేస్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని, ఏవీఆర్ ఇన్ఫోటిక్ అనే పేరుతో ఐడీ కార్డు ఇచ్చి మోసం చేశారని కల్లూరుకు చెందిన ప్రసాద్ డిసెంబరు 9న ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తామని శివాజీ అనే వ్యక్తి మోసం చేశాడని నూతనపల్లె గ్రామానికి చెందిన వంశీనాథ్ డిసెంబరు 9న ఫిర్యాదు చేశారు.
- బీటెక్ పూర్తి చేసిన తనకు హైదరాబాద్ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ. పందిపాడు గ్రామానికి చెందిన సాయికిరణ్ రూ.3.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని పసుపుల గ్రామానికి చెందిన సాయికిరణ్ డిసెంబరు 16న ఫిర్యాదు చేశారు.
- అదే రోజు బెంగుళూరు ఐటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో జాబ్ ఇప్పిస్తామని చెప్పి చరణ్‌రెడ్డి పేరుతో ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో పరిచయమై రూ.40వేలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు వడ్డేగేరికి చెందిన ఆసీఫ్‌బాషా ఎస్పీకి ఫిర్యాదు.
- పత్తికొండ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలు చెందిన శ్రావణ్ కుమార్, మధుకిరణ్ రూ.1.75 లక్షలు తీసుకుని మోసం చేశారని పత్తికొండ మండలం బుగ్గతాండ గ్రామానికి చెందిన శివ నాయక్ డిసెంబరు 23న ఫిర్యాదు చేశారు.
- కర్నూలు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో తన కుమారుడికి, కుమార్తెకు ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన ఆయేషాబేగం, జహీర్ రూ.5.75 లక్షలు తీసుకుని మోసం చేశారని, కర్నూలు వివేక్‌నగర్‌కు చెందిన ఉదయ్ కుమార్ సెప్టెంబరు 9న ఫిర్యాదు చేశారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు



మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. ఉద్యోగాలు పోటీలు పరీక్షలు, ప్రతిభ ఆధరాంగానే వస్తాయి. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు తీసుకుని మోసం చేశారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చాలా మంది ఫిర్యాదు చేస్తున్నారు. అమాయకులను లక్ష్యంగా ఎంచుకుని దళారులు మోసాలు చేస్తున్నారు.
-విక్రాంత్ పాటిల్, ఎస్పీ

ప్రతిపక్ష హోదా ఎలా వచ్చేదీ తెలియదా?

జగన్ రెడ్డిని ప్రశ్నించిన కుడా చైర్మన్ సోమిశెట్టి



కర్నూలు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా ఎలా వచ్చేదీ తెలియని మూర్ఖుడా పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి.. అని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని 11 సీట్లకే ప్రజలు పరిమితం చేస్తే.. కూటమి ప్రభుత్వం ఎలా ప్రతిపక్ష హోదా ఇస్తుందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ చేసిన అరాచక పాలనతో విసిగి వేసారిపోయిన జనం కనీసం ప్రతి పక్ష హోదా కూడా రాకుండా ఇంటికి పరిమితం చేశారని అన్నారు. రాజకీయాలు ఎలా చేయాలో తెలియకుంటే యువత నేత లోకేష్ వద్ద శిక్షణ తీసుకోవాలని హితవు పలికారు.



నవరత్నాల రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రుడు

రాఘవేంద్రుడికి నీరాజనం

- పులకరించిన మంత్రాలయం
- నవరత్నాల రథంపై స్వామివారు
- 350 మంది సంగీత విద్వాంసులచే నాదాహారం
- ముగిసిన గురు వైభవోత్సవాలు

మంత్రాలయం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జయహో గురు రాఘవేంద్రా విజయహో అంటూ దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రాఘవేంద్రస్వామి నామస్మరణతో పులకించారు. గురువైభవోత్సవాల్లో ఆఖరిరోజు రాఘవేంద్రస్వామి 430వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవరాయని బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు కవచాన్ని నవరత్నాల రథంపై ఏర్పాటు చేసి హారతులు ఇచ్చి రథాన్ని ముందుకు నడిపించారు. జయహో గురు రాఘవేంద్రా విజయహో.. భక్తుల జయధ్వానాలతో మఠం మారుమోగింది. రథం ముందు భజన మండళ్ల మహిళలు, కోలాట నృత్యాలు, మంగళవాయిద్యాలు, చండీ వాయిద్యాలతో స్వామి వైభవంగా ఊరేగారు. అనంతరం ఊంజల మండపంలో రజిత సింహాసనంపై రాఘవేంద్రస్వామికి పుష్పాభిషేకం చేశారు.



హారతులు ఇస్తున్న పీఠాధిపతి



ఉత్సవాల ముగింపులో పాల్గొన్న అశేష భక్త జనవాహిని

నాదాహారంతో మార్మోగిన మంత్రాలయం:

చెన్నైకి చెందిన రాఘవేంద్రస్వామి నాదాహార సేవ సమితికి చెందిన 350 సంగీత విద్వాంసుల నాదాహార సమర్పణ సేవతో మంత్రాలయం మార్మోగింది.

రాఘవేంద్రుల సన్నిధిలో కన్నడ ప్రముఖ సినీ నటుడు జగ్గేష్

ఉత్సవాల ముగింపులో భాగంగా కన్నడ ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు జగ్గేష్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే రాఘవేంద్రుడు

అశేష భక్తజనవాహిని మధ్య పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు దివ్య సందేశాన్ని వినిపించారు. రాఘవేంద్రస్వామి భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారమని అన్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుఖించాలని రాఘవేంద్రస్వామికి పూజలు చేస్తామన్నారు.

భక్తులను ఆకట్టుకున్న భరతనాట్యం:

రాఘవేంద్రస్వామి 430వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని గురువారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగుళూరు చెందిన నృత్యాంజలి కళానికేతన్ వారిచే నిర్వహించిన భరతనాట్యం, బెంగుళూరు చెందిన డా. విశ్వనాథ్‌భట్ హిందుస్థాన్ సంగీతం భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్వాన్ పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజాఎస్‌గిరిరాజాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మాజీ మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఠాధిపతి



సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాకారులు



బంగారు పల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రస్వామి

ఆగిపోయిన క్లస్టర్ వర్శిటీ నిర్మాణాలు



దక్షిణ భారత దేశానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన క్లస్టర్ యూనివర్శిటీ నిర్మాణాలు అటకెక్కాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులతో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ నిర్మాణాలను నిలిపి వేసింది. గత వైసీపీ హయాంలో క్లస్టర్ యూనివర్శిటీ భవన నిర్మాణాల మీద అనేక వివాదాలు చెలరేగాయి. వీటి మీద విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేశాయి. నిధులు యూనివర్శిటీవి అయినప్పుడు భవన నిర్మాణాలు మాత్రం ఏపీఈడబ్ల్యూఐడీసీకి ఎలా చెందుతాయని వర్శిటీ అధికారులు ప్రశ్నించారు. ప్రత్యేక ఉపాధి, పరిశోధనలతో పాటు ఉపాధి కోర్సులతో ఏర్పాటైన వర్శిటీ నిర్మాణాల వ్యయం పెంచి, అప్పటి వైసీపీ పెద్దలు ఇష్టానుసారంగా దోచేశారనే ఆరోపణలున్నాయి.

- నిధులు క్లస్టర్‌వి..భూములు, నిర్మాణాలు ఏపీఈడబ్ల్యూఐడీసీవి
- వైసీపీ సర్కార్‌లో పెంచిన నిర్మాణాల వ్యయం..
- కూటమి ప్రభుత్వం చెల్లించిన పాత బకాయిలు రూ. 20 కోట్లు
- క్లస్టర్ పేరున మార్చి భూములు అప్పగించాలి- వీసీ


కర్నూలు అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకంగా 2023లో కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టుపై రూ. 80.05 కోట్లతో క్లస్టర్ యూనివర్శిటీ భవన నిర్మాణాలను ప్రారంభించారు. అయితే ఈ పనుల్లో పలు అవినీతి ఆరోపణలు వినిపించాయి. 70 శాతం పనులు పూర్తయ్యాయి. భూములు క్లస్టర్ వర్శిటీ పేరున లేక పోవడంపై విద్యార్థి సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం దిగి పోయే సమయాన మరి కొన్ని పనుల కోసం ఆ నిర్మాణ వ్యయాన్ని రూ. 139.9 కోట్లకు పెంచుతూ గెజిట్ జారీ చేసింది. రూ. 140 కోట్లు పెంచితే కేబినెట్ ఆమోదం అవసరమని గ్రహించిన వైసీపీ పాలనలో ఓ మంత్రి దాన్ని కూడా తమకు అనుకూలంగా మలుచుకున్నారనే ఫిర్యాదులు కూటమి ప్రభుత్వానికి వెళ్లాయి. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కొందరు విద్యార్థులు ఫిర్యాదులు చేశారు. ఒకే వర్శిటీలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉంటే ప్రత్యేక వసతులు, కోర్సులతో ఏర్పాటైన వర్శిటీకి ఆదిలోనే ఇలాంటి సమస్యలు ఎదురు కావడం పట్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

- దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వం మోడల్ క్లస్టర్ వర్శిటీకి దక్షిణ భారత దేశంలో కర్నూలును ఎంపిక చేసింది. అప్పటి వరకు కొనసాగుతున్న సిల్వర్ జూబ్లీ కళాశాల స్థానంలోనే దీన్ని ఏర్పాటు చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు వెంటనే ఆమోదం తెలుపుతూ 2020 జనవరి 3న కేంద్రం గెజిట్ జారీ చేసింది. 2021 ఫిబ్రవరి 3న క్లస్టర్ యూనివర్శిటీని ప్రకటించింది. ఆదే నెలలో 5 వ తేదిన మొదటి ఉపకులపతిగా ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ బాధ్యతలు తీసుకున్నారు. తాత్కాలికంగా సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌హెచ్‌ఆర్‌డీ కింద రూ. 55 కోట్లతో నిర్మించిన భవనాలను తాత్కాలికంగా క్లస్టర్ యూనివర్శిటీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆతర్వాత నగర శివారులోని జగన్నాథ గట్టుపై 50.05 ఎకరాలను క్లస్టర్ యూనివర్శిటీకి కేటాయిస్తూ ఒక గెజిట్ జారీ చేసింది. 2023లో అప్పటి వైసీపీ మంత్రి వర్శిటీకి చెందిన స్థలాన్ని ఏపీఈడబ్ల్యూఐడీసీకి కేటాయించడానికి అప్పటి కలెక్టర్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారని యూనివర్శిటీ అధికారులు అంటున్నారు. నిర్మాణాల పర్యవేక్షణలో యూనివర్శిటీకి సంబంధం లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేశారని కొన్ని విద్యార్థి సంఘాలు అప్పట్లో ఆందోళన చేశాయి. ఇలాంటి సంఘటనలు వెలుగులోకి రావడంతో అప్పటి వర్శిటీ రిజిస్ట్రార్‌పై బదిలీ వేటు పడింది. ఈ క్రమంలోనే రూ. 46 కోట్ల నిధులు ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు తమ ప్రమేయం లేకుండా మ్యాపింగ్ చేసి నిధులను కాజేశారని ఉన్నత విద్యామండలికి వర్శిటీ ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ఓ మాజీ మంత్రి అస్మీతానై బీనామీ కంపెనీలతో నిర్మాణాలు చేయించారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. క్లస్టర్ యూనివర్శిటీకి కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా తమ వంతు వాటాగా రూ. 80.05 కోట్ల నిధులు, భూములను అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023లో నిర్మాణాలను ప్రారంభించి పనులను వేగవంతం చేసింది. నిర్మాణాల విషయంలో క్లస్టర్ యూనివర్శిటీ ఉన్నతాధికారుల ప్రమేయం తగ్గించాలన్న నెపంతో వర్శిటీ పేరు ఎక్కడా లేకుండా నగర శివారులోని జగన్నాథగట్టుపై 50.5 ఎకరాల భూములను ఏపీఈడబ్ల్యూఐడీసీ పేరున అప్పటి కలెక్టర్ బదలాయించేలా మంత్రి ఆదేశించారనే ప్రచారం జరిగింది. భూములు, నిర్మాణాల ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని వర్శిటీ ఉన్నతాధికారులు అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో జిల్లాకు చెందిన మంత్రి, కలెక్టర్‌ను ప్రశ్నించినా ప్రయోజనం లేకుండా పోయిందని వర్శిటీ ఉన్నతాధికారులు ఇప్పటికీ గగ్గోలు పెడుతున్నారు.

ఫిర్యాదులపై విచారణలో మంత్రి ఫేషీ..

క్లస్టర్ వర్శిటీపై వచ్చిన ఫిర్యాదులను విద్యాశాఖ మంత్రి పేషీ సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. నిర్మాణాలను నిలిపి వేసి, ఏమైనా అవకతకలు జరిగాయా అన్న కోణంలో ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో ఉన్నత విద్యామండలికి చెందిన ఓ బృందం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఇటీవల కాంట్రాక్టర్‌కు రూ. 20 కోట్ల పెండింగ్ బిల్లును చెల్లించింది.



క్లస్టర్ వర్శిటీ భూములను ఏపీఈడబ్ల్యూఐడీసీ కేటాయించిన భూములను తమ పేరున మార్చాలని కలెక్టర్, ఉన్నత విద్యాశాఖను కోరిన వర్శిటీ అధికారుల లేఖ

భూములకు వర్శిటీ పేరు లేకుండా చేశారు

క్లస్టర్ యూనివర్శిటీ నిధులు మాత్రం ఖర్చు చేస్తూ, భూములను ఏపీఈడబ్ల్యూఐడీసీకి ఎలా కేటాయిస్తారు? ఈ విషయం అప్పటి విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు చేశాం. వెంటనే వర్శిటీ భూములు మాకే కేటాయించాలి. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిస్తున్నాం. వెంటనే నిర్మాణాలు పూర్తి చేసి కొత్త భవనాలు అప్పగించాలి. - ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, ఉపకులపతి క్లస్టర్

అసెంబ్లీకి చేరిన గుండ్రేవుల..!

- చర్చకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరిన ఎమ్మెల్యే గౌరు చరిత
- నివేదిక కోరిన శాసనసభ సెక్రెటరీ జనరల్
- సమగ్ర వివరాలతో నివేదిక పంపిన ఇంజనీర్లు
- 2019లో నిధులు కేటాయించిన చంద్రబాబు
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం



గుండ్రేవుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తూ 2019 మార్చి 2న అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు

(5వ పేజీ తరువాయి)

ఈ నివేదిక ఆధారంగా 2019 ఫిబ్రవరి 21న నాటి టీడీపీ ప్రభుత్వం రూ.2,890 కోట్లు మంజూరు, సూత్రపాయ పరిపాలన ఆమోదం ఇస్తూ జీఓ నం.153 జారీ చేసింది. మార్చి 2న గుండ్రేవుల, ఎల్లెల్సీ బైపాస్ కెనాల్‌పై నిధులు మంజూరు శిలాఫలకాన్ని నాటి చంద్రబాబు ఆవిష్కరించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్రాష్ట్ర సమస్య అంటూ గుండ్రేవుల ప్రాజెక్టు ఫైల్‌ను ఐదేళ్ల అటకెక్కించింది. గత ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా సీఎం చంద్రబాబు, యువగళం పాదయాత్ర సమయంలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ టీడీపీ అధికారంలోకి రాగానే గుండ్రేవుల ప్రాజెక్టును చేపడుతామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

అసెంబ్లీలో చర్చకు అవకాశమివ్వండి

కర్నూలు, నంద్యాల జిల్లాలకు జీవనాడి కానున్న గుండ్రేవుల ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి వినతిపత్రం ఇచ్చారు. ఆమె విన్నపాన్ని స్వీకరించిన స్పీకర్ ఇదే అంశాన్ని ప్రశ్న నంబరు.802 కింద ఎమ్మెల్యే గౌరు చరిత అడిగేలా ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత సమగ్ర వివరాలతో పూర్తి నివేదిక ఇవ్వాలని అసెంబ్లీ సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీని కోరారు. ఆయన ఆదేశాల మేరకు ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ ఇంజనీర్లు ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ఏ పరిస్థితిలో ఉందో.. సమగ్ర వివరాలతో నివేదిక పంపించారు. ఒకటి రెండు రోజుల్లో అసెంబ్లీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. గుండ్రేవుల ప్రాజెక్టుపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టమైన హామీ వచ్చే అవకాశం ఉందని సాగునీటి నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏటీఎంలే టార్గెట్



- డ్రైవర్లుగా వచ్చి దోపిడీలు
- పోలీసుల అదుపులో హరియాణ దొంగలు
- పట్టించిన సీసీ కెమెరాలు
- తండ్రీకొడుకులు, మామ అల్లుళ్ల అరెస్ట్

కర్నూలు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వారంతా బంధువులే. తండ్రీ కొడుకులు, మామా అల్లుళ్లు వారి బంధువులు. కంటైనర్ డ్రైవింగ్ పనుల కోసం వచ్చామని చెప్పుకునేవారి అసలైన ప్రవృత్తి చోరీలు చేయడం. అందులోనూ ఏటీఎం సెంటర్లనే టార్గెట్ చేసుకుంటూ ఏకంగా ఏటీఎం యంత్రాలను దోచుకెళ్లేవారు. ఇటీవలి కాలంలో కర్నూలు జిల్లాలో వరుస చోరీలు జరగడంపై పోలీసులు నిఘా ఉంచి ఎట్టకేలకు నిందితులను అరెస్ట్ చేశారు. చోరీలకు పాల్పడుతున్న హరియాణ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి గురువారం అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు చంద్రబాబు నాయుడు, శేషయ్య, వంశీధర్‌లు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. హరియాణ రాష్ట్రం మేవాత్ జిల్లాకు చెందిన జంషాద్ ఖాన్, షౌకర్ ఖాన్‌లు తండ్రీకొడుకులు. అదేవిధంగా జంషాద్ ఖాన్, షాహీద్ ఖాన్ మామ అల్లుళ్లు. వీరితో పాటు పాల్వాల్ జిల్లాకు చెందిన ఇమ్రాన్ ఖాన్‌లు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడేవారు. వీరిలో షాహీద్‌ఖాన్ 26 చోరీలు చేయగా.. ఇమ్రాన్‌ఖాన్ 15 చోరీలు చేశాడు. జంసాద్‌ఖాన్, షావ్‌ఖార్ ఖాన్ కలిసి పదేసి చోరీలు చేశారు. షాహీద్‌ఖాన్‌కు ఇద్దరు బార్యలు, ఆరుగురు కొడుకులు. వీరంతా తమ కుటుంబ పోషణ కోసమే నేరాలకు పాల్పడేవారు.

ఆ రోజు ఏంజరిగింది..? గత నెల 24న చిన్నటేకూరు గ్రామ సమీపంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా చెందిన ఏటీఎం సెంటరు మిషన్‌ను చోరీ చేశారు. ఓ టోయింగ్ వాహనంతో ఏటీఎంను తాళ్లతో కట్టి కొంత దూరం లాక్కెళ్లారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడం, పోలీసులతో పాటు యువకులు ఈ టోయింగ్ వాహనాన్ని వెంబడించడంతో నలుగురు నిందితులు పరారయ్యారు. అంతకు ముందు రోజు కూడా కృష్ణానగర్ సమీపంలో ఓ ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఏటీఎంలో ఉన్న సీసీ కెమెరాకు స్ప్రే చేయడంతో ప్రధాన కేంద్రంలో అలారం మోగడంతో పోలీసులు అప్రమత్తమై అక్కడకు చేరుకోవడంతో గమనించి నిందితులు పరారయ్యారు. ఈ రెండు కేసులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కర్నూలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ శేషయ్య, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, దేవనకొండ సీఐ వంశీధర్, సైబర్ క్రైం ల్యాబ్ సీఐ వేణుగోపాల్, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్, ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు.

దర్యాప్తు ఇలా.. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బందంగా ఏర్పడ్డారు. టోల్ గేట్లతో పాటు సీసీ కెమెరాలను పరిశీలించారు. అమకతాడు వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఓ కంటైనర్ వాహనాన్ని గుర్తించి సెల్‌టవర్ సిగ్నల్స్ ద్వారా దర్యాప్తు ముమ్మరం చేశారు. సెల్‌టవర్ డంప్ ఆధారంగా నిందితులు బెంగుళూరు సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అరెస్టు చేసి వారి నుంచి గ్యాస్ కట్టర్, చిన్నగ్యాస్ సిలిండర్, రెండు కత్తులు, తాళాలకు ఉపయోగించే దొంగ తాళాలు, మాస్కులు, గ్లౌజ్‌లు, రెండు స్ప్రే పిన్నులు స్వాధీనం చేసుకున్నారు.



చోరీకి ఉపయోగించిన పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఎలా చేశారంటే

జంషాద్‌ఖాన్, షౌకర్ ఖాన్ కార్లు, బైకులను ట్రాన్స్‌పోర్టులు చేసే కంటైనర్ కంపెనీలో డ్రైవర్లుగా చేరారు. దిన్నెదేవరపాడు సమీపంలో ఉన్న సుజుకీ షోరూంకు కొన్ని కార్లను కంటైనర్‌లో తీసుకువచ్చారు. ఎప్పటి మాదిరిగానే దొంగతనం చేయాలని నిశ్చయించుకుని కంటైనర్‌లో నలుగురు వచ్చారు. షోరూంలో కార్లను అన్‌లోడు చేసిన తర్వాత హైదరాబాదు మార్గంలో కొంత దూరం వెళ్లి తమకు అనుకూలమైన ఏటీఎం కేంద్రాల్లో రెక్కి నిర్వహించారు. దీంతో పాటు మార్గమధ్యంలో వస్తూనే జాతీయ రహదారిలో చిన్నటేకూరులో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంపై వీరి కన్ను పడింది. ముందుగా కృష్ణనగర్ ఏటీఎం చోరీకి ప్రయత్నించి విఫల మయ్యారు. దీంతో ఆ మరుసటి రోజు బళ్లారి చౌరస్తా సమీ పంలో ఓ టోయింగ్ వాహనాన్ని చోరీ చేశారు. చిన్న టేకూరు వద్దకు వెళ్లి తమ కంటైనర్‌ను ఉలిందకొండ క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న హమారా ఘర్ డాబా ఎదుట నిలిపారు. తీరా అక్కడి నుంచి టోయింగ్ వాహ నంలో వెనక్కి వచ్చి చిన్నటేకూరు సమీపంలో ఉన్న ఏటీఎం ను చోరీ చేశారు. అటువైపుగా వెళ్తున్న కొందరు యువకులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, ఆ యువకులు కలిసి టోయింగ్ వాహనాన్ని వెంబడించడంతో ఉలిందకొండ క్రాస్ రోడ్డు వద్ద వాహనాన్ని అక్కడే వదిలేసి పరారై అరకిలోమీటరు దూరంలో ఉన్న కంటైనర్‌ను ఎక్కి పరారయ్యారు.

అనుమానం పెనుభూతమై..!

- భార్యను హతమార్చిన భర్త
- బెలుం శింగవరంలో దారుణం



మనోహరమ్మ (ఫైల్)

కొలిమిగుండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కలకాలం కంటికి రెప్పలా కాపాడాల్సిన భర్తే కాలయముడయ్యాడు. వ్యసనాలకు బానిసై.. భార్యపై అనుమానం పెంచుకుని అతి కిరాతకంగా దాడిచేసి హతమార్చిన హృదయ విదారకమైన ఘటన గురువారం సాయంత్రం కొలిమిగుండ్ల మండలం బెలుం శింగవరంలో చోటు చేసుకుంది. బెలుంశిం గవరం గ్రామానికి చెందిన బిజ్జం చిన్న వెంకటరామిరెడ్డికి మనోహరమ్మ(37)తో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. కొంత కాలంగా తాగుడుకు బానిసగా మారిన చిన్న వెంకటరామిరెడ్డి, తాను చెడు వ్యసనాలకు లోనై భార్య మనోహరమ్మపై అనుమానం పెంచుకుని నిత్యం వేధించేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పనికి వెళ్లి వచ్చిన మనోహరమ్మను అప్పటికే మద్యం మత్తులో ఉన్న చిన్న వెంకటరామిరెడ్డి రోకలి బండతో దాడి చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో పడిఉన్న మనోహరమ్మను బంధువులు బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ రమేష్‌బాబు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా నిందితుడు చిన్న వెంకటరామిరెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కర్నూలు క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కోడుమూరు రహదారిలో రిలయన్స్ మార్టు సమీపంలో గురువారం సాయంత్రం ఓ మహిళ మృతి చెంది కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు 50 ఏళ్లలోపు ఉంటుందని భావిస్తున్నారు. శరీరంపై పసుపు రంగు చీర, గులాబీ జాకెట్ ఉంది. గత కొద్ది కాలంగా మతిస్థిమితం లేక తిరుగుతూ ఉందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



చక్రవర్తి(ఫైల్)

నందవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోహరాపురం దగ్గర రోడ్డు ప్రమాదానికి గురై చక్రవర్తి (23) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. జోహరాపురం చెందిన హోసూరప్ప, సోమేశ్వరమ్మ దంపతుల రెండో కుమారుడు చక్రవర్తి పంటలకు పురుగుల మందులు తీసుకురావడానికి నాగలదిన్నెకు బయలుదేరాడు. బెళగల్ నుంచి ఓ వాహనం కందులు వేసుకొని రాయచూర్ మార్కెట్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో బైకును ఆ వాహనం ఢీకొట్టడంతో చక్రవర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. సెక్యూరిటీ గార్డు మృతి



గాయపడిన గార్డును పరామర్శిస్తున్న సింధు

కర్నూలు హాస్పిటల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పంచలింగాల టోల్‌గేట్ వద్ద సమీపంలో ఆటో బోల్తా పడటంతో కర్నూలు జీజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు మహేష్ (26) మృతి చెందాడు. కర్నూలు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఐదుగురు సెక్యూరిటీ గార్డులు విష్ణువర్ధన్ అనే సెక్యూరిటీ గార్డు పుట్టిన రోజు సందర్భంగా సెలవు పెట్టి పంచలింగాల టోల్‌గేట్‌కు వెళ్లారు. తిరిగి కర్నూలు వస్తుండగా.. ఆటో బోల్తాపడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో తీవ్రంగా గాయపడిన మహేష్‌ను కర్నూలు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మహేష్ భౌతికకాయాన్ని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధుసుబ్రహ్మణ్యం పరిశీలించారు మృతి చెందిన మహేష్ బంగారుపేట నివాసి, ఆయనకు భార్య, కూతురు ఉన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రుద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని బెస్త కాలనీలో బుధవారం రాత్రి కత్తులతో దాడి చేసుకున్న ఘటనలో ఇరువర్గాలకు చెందిన 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ గురువారం తెలిపారు. రవి ఫిర్యాదు మేరకు శ్రీకాంత్ మరో ఐదుగురిపై అలాగే విజేయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బనగానపల్లె పట్టణంలో భారీ చోరీ

బనగానపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో భారీ చోరీ ఘటన గురువారం వెలుగు చూసింది. పట్టణంలోని శివరాం థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న కూరగాయల వ్యాపారి లక్ష్మీనారాయణ ఇంటికి తాళం వేసి గత మూడు రోజుల క్రితం తిరుపతికి వెళ్లాడు. గురువారం ఇంటికి చేరుకోగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో ఉన్న 18 తులాల బంగారం, కేజీ వెండి, రూ.3 లక్షలు నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ప్రవీణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యో.. అంజలి..

- మొదటి అంతస్తులోని బ్యాంకు మెట్లు ఎక్కడంతో గర్భిణికి రక్తస్రావం
- ఆస్పత్రిలో మృత శిశువును ప్రసవించిన అంజలి
- తల్లి పరిస్థితి కూడా విషమం



108 అంబులెన్సులో ఆదోని ఆసుపత్రికి తరలిస్తున్న బంధువులు



బాధితురాలు జాలమంచి అంజలి

కోసిగి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆమె ఎనిమిది నెలల గర్భిణి. ఎస్బీఐ బ్యాంకులో పని వుండి భర్తతో వచ్చింది. బ్యాంకు మొదటి అంతస్థులో ఉండటంతో మెట్లు ఎక్కడంతో ఆమెకు రక్త స్రావం అయి ప్రమాదకర పరిస్థితికి గురైంది. ఆస్పత్రికి తరలించాక ప్రసవమైంది. బిడ్డ మృతి చెందింది. తల్లి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గురువారం కోసిగిలో జరిగింది. గ్రామంలోని 6వ వార్డుకు చెందిన జాలమంచలి అంజలి, సురేష్ దంపతులు ఎస్‌బీఐ బ్యాంకులో అకౌంటు పని నిమిత్తం వచ్చారు.

బ్యాంకు మొదటి అంతస్తులో ఉంది. మెట్ల మార్గం తప్ప.. లిఫ్ట సౌకర్యం లేదు. దీంతో అంజలి అతి కష్టం మీద మెట్లు ఎక్కి బ్యాంకులోకి వెళ్లింది. ఆ సమయంలో ఆమెకు రక్త స్రావం కావడం మహిళా ఖాతాదారులు గమనించి చెప్పారు. అప్పటికే తీవ్ర రక్తస్రావమై అంజలి కళ్లు తిరిగి అక్కడే కూర్చుండిపోయింది. ఏం చేయాలో భర్త సురేష్‌కు పాలుపోలేదు. బ్యాంకులోనే ఓ మూలన కూర్చున్నారు. వెంటనే బ్యాంకు సిబ్బంది చొరవతో ఆటోలో గర్భిణిని కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెడికల్ ఆఫీసర్ డా. మనోజ్‌కుమార్, డా. రజిత స్ట్రెచ్చర్ సిద్ధంగా ఉంచారు. గర్భిణిని డెలివరీ రూములోకి తీసుకెళ్లి పరీక్షలు చేశారు. కొద్ది సేపటికి అంజలి మగ మృత శిశువును ప్రసవించింది. అంజలి పరిస్థితి విషమంగా ఉంది. డా. రజిత మాట్లాడుతూ అంజలికి వచ్చే నెల 12వ తేదీ డెలివరీ తేదీ ఉందని, అయితే.. మెట్లు ఎక్కడం వల్లనే రక్తస్రావం జరిగి గర్భంలోనే మగ శిశువు మరణించిందని తెలిపారు. తల్లి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదోని ప్రభుత్వ మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రికి 108 అంబులెన్సులో ఈఎంటీ నాగరాజు, పైలట్ భీమేష్ తరలించారు.

బ్యాంకు మెట్లు ఎక్కడంతోనే..



నేను, నా భార్య బ్యాంకు పని నిమిత్తం వచ్చాం.. బ్యాంకు మొదటి అంతస్తులో ఉండటంతో మెట్లు ఎక్కాం. నా భార్యకు రక్తస్రావమై ఆస్పత్రిలో ప్రసవించింది. మగబిడ్డ గర్భంలోనే మరణించాడు. బ్యాంకు మెట్లు ఎక్కడంతోనే ఇదంతా జరిగింది.

- జాలమంచి సురేష్, గర్భిణి భర్త

ఉచిత కుట్టు శిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్/ నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు కులాల మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి, మిషన్లు పంపిణీ చేస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఈడీ జాకీర్ హుశేన్ గురువారం తెలిపారు. 18 - 50 సంవత్సరాల మహిళలు అర్హులన్నారు. సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9908132030 నెంబరును సంప్రదించాలన్నారు.

బీరువాలోని బంగారు నగలు ఇంటిపైన..

గడివేముల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలకలగూడురు గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీ చేశారు. ఇంట్లోని బీరువా తాళాలు తీసి 7 తులాల బంగారు గొలుసు, ఉంగరాలను చోరీ చేశారు. బాధితుడు చోరీ ఘటనపై పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలిస్తుండగా బాధితుడి ఇంటిపైన బంగారు ఉండటాన్ని గమనించారు. నగలు కనిపించడంతో బాధితుడు ఊపిరి పీల్చుకున్నాడు. ఇటువంటి ఘటన రెండు నెలల క్రితం గడివేముల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మళ్లీ బిలకలగూడురు గ్రామంలో ఇలాంటి సంఘటనే చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సారా నిర్మూలనకు కృషి చేయాలి

- సీఐలను ఆదేశించిన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి సీఐలను ఆదేశించారు. గురువారం నగంలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జిల్లాలోని ఎక్సైజ్ సీఐలతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సభలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని ప్రత్యేకంగా కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వస్తున్న సుంకం చెల్లించని అక్రమ మద్యాన్ని అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వి. రావిపాటి హనుమంతరావు, సూపరింటెండెండ్ మచ్చా సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి రామక్రిష్ణారెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

దరఖాస్తుకు గడువు పెంపు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనెల 13వ తేదీ వరకు పొడిగించినట్లు ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసం ఈనెల 6వ తేదీ వరకు ఉన్న గడువును పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు

టీసీఎస్ నిర్వహించిన గ్లోబల్ ఇన్నోవేషన్ ఆఫ్ ది ఇయర్ కాంపిటీషన్‌లో ఉమ్మడి జిల్లాల నుంచి 79 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల నుంచి 373 ప్రాజెక్టులు ఎంపిక కాగా అందులో 3 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని వివరించారు. వీటిలో దిన్నెదేవరపాడు గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం గర్వంగా ఉందని అన్నారు.

ఎస్‌డీపీఐ కార్యాలయంలో ఈడీ సోదాలు



కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన నేతలు, కార్యకర్తలు

- ఎస్‌డీపీఐ సభ్యులకు, ఈడీ బృందానికి మధ్య వాగ్వాదం
- ప్రత్యేక పోలీసు బలగాల ఆధీనంలో ఎస్‌డీపీఐ కార్యాలయం
- దాదాపు 5గంటలపాటు సాగిన సోదాలు
- వక్ఫ్ సవరణ చట్టం బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతున్నందుకే : ఎస్‌డీపీఐ నాయకులు

నంద్యాల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్‌డీపీఐ(సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) కార్యాలయంపై గురువారం ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఫరూక్‌నగర్‌లోని ఎస్‌డీపీఐ కార్యాలయం వద్ద ఉన్నట్లుండి ఈడీ అధికారులు, ప్రత్యేక పోలీసు బలగాలు రంగంలోకి దిగడంతో ఒక్కసారిగా అక్కడ ఏం జరుగుతుందోనని స్థానికులు కంగారుపడ్డారు. ఈడీ అధికారులు ప్రత్యేక పోలీసు బలగాలు మోహరించడంతో ఎస్‌డీపీఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హైదరాబాద్ నుంచి వచ్చిన నలుగురు ఈడీ అధికారుల బృందాన్ని ఎస్‌డీపీఐ కార్యకర్తలు ఆఫీసు తాళాలు తెరవకుండా అడ్డుపడ్డారు. దీంతో నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తన పోలీస్ బృందంతో వారిని వారించి తాళాలు తెరిపించారు. ఎస్‌డీపీఐ కార్యాలయాన్ని ప్రత్యేక పోలీసు బలగాలతో తమ ఆధీనంలోకి తీసుకొని సోదా చేశారు. ఈడీ సోదాలు మధ్యాహ్నం 1నుంచి సాయంత్రం 5.25 వరకు జరిగాయి. ఈడీ సోదాల్లో ఎటువంటి ఆధారాలు, డాక్యుమెంట్లు లభించకపోవడంతో ఈడీ బృందం పంచనామా నిర్వహించి వెళ్లిపోయారు. ఈడీ అధికారులు వెళ్లే సమయంలో ఎస్‌డీపీఐ కార్యకర్తలు వారి వాహనాలకు అడ్డుపడ్డారు.

ఈ సందర్భంగా వారు ఈడీకి, బీజేపీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టం బిల్లును ఎస్‌డీపీఐ వ్యతిరేకించి దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోనే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆ పార్టీ నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి ఫాజిల్ దేశాయ్ ధ్వజమెత్తారు. సోదాలకు భయపడే ప్రసక్తేలేదని న్యాయపరంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఆటో కార్మికులను ఆదుకోవాలి: ఏఐటీయూసీ



నందికొట్కూరులో ధర్నా చేస్తున్న నాయకులు, ఆటో కార్మికులు

నందికొట్కూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మిక రంగాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి కోరారు. పట్టణంలోని పటేల్ సెంటర్‌లో గురువారం ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా చేపట్టారు. రఘురామ్మూర్తి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు ఇవ్వాలని, మోటారు వాహనదారులపై మెడమీద కత్తిపెట్టిన విధంగా భారీ జరిమానాలు, శిక్షలు విధించే జీవో నెంబర్లు 21, 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో మోటారు వాహనాలపై ఉన్న పాత పోలీసు రవాణా ఈ -చలానాలను రద్దు చేయాలన్నారు. ఆర్టీసీ తర్వాత రవాణా రంగంలో ఆటో రంగం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర, దేవరం, రామకృష్ణ, షేక్షావలి, రవికుమార్, సురేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

● ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవితం చాలా అమూల్యమైనదని, నాశనం చేసుకోవద్దని నంద్యాల జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి బి. రాధారాణి సూచించారు. నంద్యాల శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాల మహిళా సాధికారిత సెల్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శ్రీ వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి న్యాయాధికారి రాధారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 18 ఏళ్లలోపు పిల్లల పట్ల ఫిజికల్‌గా కాని, సెక్సువల్‌గా కాని ఇబ్బంది పెట్టడం హింసించడం, ఈవ్ టీజింగ్ గానీ చేస్తే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తారని, నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా ఉంటుందని వివరించారు. సమావేశంలో కళాశాల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రగతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలంలోని బిజినవేముల గ్రామంలో పలు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. గణపతి సహిత లక్ష్మీసత్యనారాయణ స్వామి, సీతారామలక్ష్మణహనుమత్ సమేత హనమత్ ధ్వజ, వృషభ ధ్వజ, ఆలయ శిఖర సహిత వీరాంజనేయ స్వామి, రాధాకృష్ణ, వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. టీడీపీ నంద్యాల ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అంతా స్నేహ సౌభ్రాతృత్వంతో మెలగాలని, గ్రామాల అభివృద్ధికి అంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ రవియాదవ్, టీడీపీ మిడుతూరు మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుశేన్, మద్దిలేటి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆలయ వార్షిక వేడుకలు ప్రారంభం



కలశాలతో వస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నంద్యాల జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ దేవి ప్రతిష్ఠ షోడశ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఉదయం గ ణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణాలు, మంటప పూజ లు, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉదయం 6 గంటలనుంచి తమ ఇంటి వద్దనుంచి కలశాలతో నీరు తీసుకొని అమ్మవారి సన్నిధికి చేరుకుని అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన దీక్షా హోమం, ప్రదోషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు శ్రీచక్ర పూజలు, కుంకుమార్చనలు చేశారు.

'పశువులకు టీకాలు తప్పనిసరి'

పగిడ్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పశువులకు వ్యాప్తించే గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణకు పాడి రైతులు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ రామాంజులు నాయక్ సూచించారు. మండలంలోని పాలమర్రి, ముచ్చుమర్రి, నెహ్రూనగర్ పశువైద్య ఉప కేంద్రాల్లో నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఏడీ మాట్లాడుతూ ఈ నెల చివరి వరకు పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకా అందజేస్తున్నట్లు తెలిపారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాడి రైతులకు సూచించారు. అనంతరం పశువైద్యశాలలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు: డీఈవో

పగిడ్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నేర్చాలని, ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని డీఈవో జనార్దన్‌రెడ్డి సూచించారు. పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలను డీఈవో గురువారం తనిఖీ చేశారు. జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. డీఈవో మాట్లాడుతూ పరీక్షలంటే ఎవరూ భయపడవద్దని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ ఉంచాలన్నారు. అనంతర రికార్డులను తనిఖీ చేసి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంఈవో మురళీమోహన్‌రెడ్డి, హెచ్ఎం మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

● ఆదర్శ పాఠశాలలో వంట నిర్వాహకుల మధ్య సమస్యల కారణంగా విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి భోజనం తెచ్చుకునే పరిస్థితి నెలకొందని, నిర్వాహకులు పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని డీఈవో జనార్ధన్‌రెడ్డి హెచ్చరించారు. తరగతిగదిలోకి వెళ్లి ఎంత మంది విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి భోజనం తెచ్చుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు.

నందికొట్కూరు రూరల్: విద్యార్థులు ఇష్టంతో చదివితే విజయం



పగిడ్యాల జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్ధన్‌రెడ్డి

సాధించవచ్చని డీఈవో జనార్దన్ రెడ్డి అన్నారు. మండలంలోని కొణిదేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో పరీక్షలపై సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు అవసరమైన ప్రత్యేక పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. రికార్డులను రసాయనిక ప్రయోగశాలను, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. క్రీడా మైదానంలో కొబ్బరిచెట్లను నాటారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాన్, హెచ్ఎం శ్రీరామ చంద్రమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు నేటి నుంచి స్పెషల్ డ్రైవ్



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఈవోఆర్డీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాణ్యం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లకు శుక్రవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ తెలిపారు. ఈనెల 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పన్ను వసూళ్లలో పూర్ అన్న వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. కలెక్టరు, డీపీవోలు మండలంలోని పన్ను వసూలుపై నివేదికలు అందించాలని ఈవోఆర్డీని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో గురువారం పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించి ఈనెల 10 వతేదీ లోపల వంద శాతం పన్ను వసూలు చేపట్టాలని ఈవోఆర్డీడీ ఆదేశించారు. ఈవోఆర్డీ మాట్లాడుతూ పాణ్యం మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో బలపనూరు, భూపనపాడు గ్రామాలు పన్ను వసూళ్లలో వెనకబడి ఉన్నాయన్నారు. పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీలో పన్ను వసూలులో వెనకబడి ఉందన్నారు. పాణ్యం గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు రూ. 3,99,375 పన్ను చెల్లించాల్సి ఉందన్నారు. వీటిలో విద్యుత్ కార్యాలయం రూ.4944, పొదుపు లక్ష్మీ కార్యాలయం రూ. 16284, స్త్రీశక్తి భవన్ రూ. 37391, దేవదాయశాఖ రూ. 40299, తహసీల్దారు కార్యాలయం రూ.47,230లు, మండల పరిషత్ కార్యాలయం రూ.60,709, ఎస్ఆర్‌బీసీ కార్యాలయాలు రూ. 1,92, 518 చెల్లించాల్సి ఉందని చెప్పారు. అలాగే వాణిజ్య ప్రకటనల పన్నువసూళ్లపై నియమ నిబంధనలు తెలిపారు. భవనాలపై పెద్ద హోర్డింగ్‌ల యజమానులకు నోటీసులు పంపించాలన్నారు. హోర్డింగ్‌ల ఏర్పాటులో పంచాయతీ అనుమతులు తెలుసుకోవాలన్నారు. ఇంటి గోడలపై వేసిన వాణిజ్య ప్రకటనల సంస్థలకు నోటీసులు జారీ చేసి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు.

'సమస్యలు పరిష్కరించాలి'



పాములపాడులో మాట్లాడుతున్న రమేశ్

పాములపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గత 20 సంలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాల పెంపు విషయంపై అసెంబ్లీలో ప్రకటన చేయాలని, సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ కోరారు. గురువారం పాములపాడులో ఏపీ మోడల్ స్కూల్ మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మెస్ బిల్లులు పెంచాలని, కార్మికుల వేతనాలు పెంచాలని ఈ నెల 19న విజయవాడ ధర్నా చౌక్‌లో మధ్యాహ్న భోజనం కార్మికుల రాష్ట్రవ్యాప్త మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యంత తక్కువ వేతనాలకు పని చేస్తున్నారని అన్నారు. కార్మికులను అర్థాంతరంగా తొలగించే విధానాన్ని ఆపాలని, వీరిని ఉద్యోగులుగా గుర్తించాలని, హెల్త్‌కార్డు, ఎక్స్‌గ్రేషియా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటల్లో పెరిగిన ఆదాయం

వెలుగోడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు గ్రామ పంచాయతీకి సంబంధించిన సంతమార్కెట్, బస్టాండ్, కబేళాకు నిర్వహించిన వేలం పాటలతో గ్రామ పంచాయతీకి రూ. 3.7 లక్షల ఆదాయం పెరిగినట్లు అధికారులు తెలిపారు. గురువారం నిర్వహిం చిన వేలం పాటలో సంతమార్కెటు వేలం ద్వారా రూ. 2.32 లక్షలు , బస్టాండు ద్వారా రూ. 4,01,000, కబేళా ద్వారా రూ.97 వేలు వచ్చిందని చెప్పారు. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది వేలం పాటలతో గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చిందని చెప్పారు. డీఎల్‌పీవో రాంబాబు, ఈవోఆర్డీ గంధం మురారి, పీఎస్ సుంకన్న సిబ్బంది పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి పూజలు

శ్రీశైలం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద ఉన్న దత్తాత్రేయ స్వామివారికి లోకకల్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయ స్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

● నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా దేవస్థానం గురువారం సాయంత్రం రాజమహేంద్రవరానికి చెందిన తాతా సందీప్ శర్మగారిచే ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద దక్షయజ్ఞంపై ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. స్వామి, అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ధర్మపథం కార్యక్రమాలను దేవస్థానం చేపడుతోంది.

లక్ష్మీనారసింహుడిని తాకిన సూర్యకిరణాలు



లక్ష్మీనారసింహుడిని తాకుతున్న సూర్యకిరణాలు

ఆత్మకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలో అత్యంత విశిష్టత కలిగిన నల్లకాల్వ లక్ష్మీ నరసింహ స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌ను సూర్యకిరణాలు స్పర్శించాయి. తూర్పు ద్వారంగా దర్శనభాగ్యం కల్గించే స్వామి అమ్మవార్లపై ఉత్తరాయనంలో సూర్య కిరణాలు ప్రసరించడం విశేషంగా ఇక్కడ భక్తులు భావిస్తారు. ఉత్త రాయనంలోని పుష్యమాసం నుంచి ఆషాడమాసం వరకు ఉదయం 6.10గంటల నుంచి 6.20గంటల సమయం మధ్యలో ఈ అపురూపమైన దృశ్యం సాక్ష్యాత్కారిస్తోంది. కాగా ఎక్కడ లేనివిధంగా నల్లకాల్వ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్లు పానిమట్టంపై లింగాకృతిలో ఉన్న శిలపై కొలువుతీరి భక్తులచే పూజలందుకుంటున్నారు. గర్భాలయం ఎదుట 120అడుగుల దూరం ముఖమంటపం, కళ్యాణ మంటపం ఉన్నప్పటికీ వాటిని దాటి సూర్యకిరణాలు గర్భాలయంలోని మూలవిరాట్‌పై ప్రసరించడం అద్భుతమని చెబుతారు. ఈ కిరణాలు స్వామిఅమ్మవార్లపై పడటంతో గర్భాలయ గోడలపై మూలవిరాట్ నీడ ప్రతిబింబిస్తోంది.

'సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి'



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

బండిఆత్మకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఎక్కడైనా, ఏ సమయంలోనైనా ఎంతటి ఆపదలు, సమస్యలు వచ్చినా ధైర్యంగా వాటిని ఎదుర్కోవాలని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. గురువారం బండిఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో కేజీబీవీ విద్యార్థినులకు, మహిళలకు ప్రత్యేక డెస్క్, సెట్ పనితీరు, రికార్డుల నిర్వహణ, ఎఫ్ఐఆర్ నమోదు గురించి ఎస్ఐ వివరించారు. కష్టాల్లో ఉన్నప్పుడు పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సారా ధ్వంసం

నందికొట్కూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నంది కొట్కూరు మండలంలోని కోళ్ళబావాపురం గ్రామంలో ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో 800 లీటర్ల బెల్లం ఊటను అలాగే 35 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని ధ్వసం చేశారు. గురువారం కోళ్ళబావాపురం గ్రామంలో ఎక్సైజ్ ఎస్సై జఫ్రూల్లా ఆధ్వర్యంలో గ్రామంలో, అలాగే శివారులో దాడులు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని గ్రామస్థులకు సూచిస్తూ నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ క్రిష్ణవేణమ్మ, స్వయం సహాయక బృందం అధ్యక్షులు రవణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

'మహిళల భద్రతే లక్ష్యం'

నంద్యాల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారుల భద్రతే తమ లక్ష్యమని పోలీస్ అధికారులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్, నంద్యాల ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎస్.యుగంధర్‌బాబు సూచనలతో నంద్యాల జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విధినిర్వహణలో పోలీసులు వినియోగించే 410 డీపీ మస్కట్, 7.62ఎంఎం బోల్ట్ యాక్షన్ రైఫెల్, 7.62ఎంఎం ఎస్ఎల్ఆర్, 7.62ఎంఎం ఏకే 47రైఫెల్ 9ఎంఎం కార్బన్, 9 ఎంఎం పిస్టల్, వీఎల్ పిస్టల్ 16ఎంఎం పీపీటీ, ఫెడరల్ గ్యాస్ గన్, టియర్ స్మోక్ గ్రనేడ్స్, టియర్ స్మోక్ షెల్, 303 రైఫిల్, 380 రివాల్వర్, ఫైబర్ లాఠీ, హెల్మెట్ స్టోన్ గార్డ్, బాడీ ప్రొటెక్టర్, పోలీస్ వయర్‌లెస్ కమ్యూనికేషన్, హాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్, డీప్‌సర్చ్ మెటల్ డిటెక్టర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ తదితర పరికరాలు, అవి పనిచేసే విధానంను పోలీస్ అధికారులు విద్యార్థినులకు వివరించారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమ్యూనికేషన్ కార్యాలయం, పోలీస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, డీసీఆర్‌బీ, సైబర్ క్రైం, పాస్‌పోర్ట్ తదితర కార్యాలయాల పనితీరు వారి రికార్డులు ఉపయోగించే పరికరాలపై విద్యార్థినులకు వివరించారు. సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయరెడ్డి విద్యార్థినులకు వివరిస్తూ స్వీయరక్షణ నైపుణ్యాలు, మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలని సూచించారు. సైబర్ భద్రత నియమాలపై ప్రస్తుతం



ఆయుధాల పనితీరు గురించి విద్యార్థినులకు వివరిస్తున్న పోలీసు అధికారులు

టెక్నాలజీ యుగంలో ఉన్నామని, స్మార్ట్ మొబైల్స్ ఎక్కువగా వాడొద్దని అలా చేయడంవల్ల సైబర్ క్రైం లాంటి నేరాలు జరగడానికి అవకాశం ఉందని, అనధికారిక యాప్స్, మొబైల్స్‌లో వచ్చే లింక్‌లు సెలెక్ట్ చేయొద్దని అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎల్లవేళలా పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు ఉంటాయని పోలీస్ అధికారులు భరోసా కల్పించారు. మహిళలు, చిన్నారులు అత్యవసర సమయంలో సహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లను సూచించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెం.1098, ఉమెన్ హెల్ప్‌లైన్ నెం.181, పోలీస్ హెల్ప్‌లైన్ నెం.100 / 112, సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెం.1930, నంద్యాల పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెం.9154878120, ల్యాండ్‌లైన్ నెంబరు 08514-225097లకు కాల్‌చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నందికొట్కూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బేబి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు పురపాలక సంఘం కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు. కావున పట్టణ ప్రజలు తమ సమస్యలను వేదిక దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు.

ఎలక్ట్రానిక్ సర్క్యూట్ డిజైన్ ల్యాబ్ ప్రారంభం

పాణ్యం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఎలక్ట్రానిక్ సర్క్యూట్ డిజైన్ ల్యాబ్ ప్రారంభించినట్లు హెచ్‌వోడీ డాక్టర్ సోఫియా ప్రియదర్శిని తెలిపారు. ల్యాబ్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు ప్రారంభించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, రామిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'విజయవంతం చేయాలి'

బండిఆత్మకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు ఈనెల 12వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ పిలుపునిచ్చారు. గురువారం బండిఆత్మకూరు, శింగవరం గ్రామాల్లో ఉపాధి కూలీలకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుపాల్, సురేష్, మార్తమ్మ, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం'



మాట్లాడుతున్న ఎంపీడీవో దశరథరామయ్య

మిడుతూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చి దిద్దుదామని ఎంపీడీవో దశరథరామయ్య పిలుపునిచ్చారు. మిడుతూరులోని చెత్త సేకరణ కేంద్రం వద్ద గురువారం పంచాయతీ కార్యదర్శులకు చెత్త సేకరణ, ప్లాస్టిక్ రహిత గ్రామాల పట్ల శిక్షణ కార్యక్రమం ఎంపీడీవోతో పాటు ఈవోఆర్డీ సంజన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు పొదుపు మహిళలకు, రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సర్పంచ్ జయలక్ష్మమ్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఛావా సినిమా ప్రదర్శన ఆపాలి'

నంద్యాల నూనెపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మత విద్వేషాలను రెచ్చగొట్టే ఛావా సినిమా ఉందని, రాష్ట్రంలో ఆ సినామా ప్రదర్శనను ఆపాలని ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షుడు అబులైస్, కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ, కో కన్వీనర్ సద్దాం హుసేన్ డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని కలెక్టరేట్ ఆవరణలో ముస్లిం జేఏసీ నాయకులు నిరసన చేపట్టి కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ భారతదేశంలో హిందూ, ముస్లింల మధ్య భేదాభిప్రాయాలు కలిగించేలా, ముస్లింల మనోభావాలను కించపరచేవిధంగా ఛావా చిత్రం ఉందని, ఇలాంటి చిత్రం ఏపీలో తెలుగు భాషలో విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేసిందని, వెంటనే ఆ చిత్రాన్ని విడుదల కాకుండా నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్‌కలాం, అన్సర్, మహమ్మద్‌ఆలీ, మునీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు, లారీ ఢీ.. ముగ్గురికి గాయాలు

మహానంది, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. గురువారం మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నంద్యాలకు వస్తుండగా మార్గమధ్యలోని గాజులపల్లి సమీపంలోని మదీనా రైస్‌మిల్లు వద్ద రివర్స్ చేసుకుటున్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న నాగేశయ్య, ప్రేమరాజ్, రామ చంద్రుడు గాయపడ్డారు. రోడ్డు సేఫ్టీ పోలీసులు గాయపడ్డ ప్రయాణికులను చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహానంది పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి మృతి

కొత్తపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన బోగోలు సుబ్బారెడ్డి (75) మృతి చెందాడు. గోకవరం గ్రామం శివారులోని దర్గా వద్ద జరిగిన ఉరుసు కార్యక్రమానికి గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే కొత్తపల్లి, ఎం.లింగాపురం గ్రామాల మధ్య రోడ్డుపై రక్తపు గాయాలతో స్పృహతప్పి పడి ఉన్నారు. ఆయనను చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అయితే మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందారు. ఈ విషయంపై కొత్తపల్లి ఎస్ఐ కేశవ్‌ను వివరణ కోరగా.. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని చెప్పారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'కుల గణన చేపట్టాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

నంద్యాల రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జనగణతో పాటు కుల గణన చేపట్టాలని ఏపీ చేతి వృత్తుల దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల పట్టణంలోని నిశాంతి భవన్‌లో విపక్షాలు, ప్రజాసంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రామాంజనేయులు మాట్లాడుతూ కులగణన చేపట్టితే ప్రభుత్వ పథకాలు అవసరమైన వర్గాలకు మరింత మెరుగ్గా అందజేయవచ్చన్నారు. తద్వార సామాజిక ప్రజాస్వామ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడానికి మరింత స్పష్టత కలుగుతుందన్నారు. సమావేశంలో చేతి వృత్తి దారులు సమాఖ్య జిల్లా కార్యదర్శి రామ్మోహన్, బాబాఫక్రుద్దీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ పంపిణీ చెంచులకే అప్పగించాలి'

పాణ్యం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ఇందిరాకాలనీలో రేషన్ పంపిణీని చెంచులకే అప్పగించాలని రాష్ట్ర చెంచు సంరక్షణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నందికొండ శ్రీను కోరారు. గురువారం ఇందిరానగర్‌లోని చెంచుకుటుంబాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలోని 300 లకుటుంబాలు సమయానికి రేషన్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జీసీసీ స్టోర్‌లో 15 రోజులు రేషన్ అందించాల్సిన సిబ్బంది రెండు రోజులే అందించి స్టోర్ మూసివేస్తున్నారన్నారు. రేషన్ షాపును ఆళ్లగడ్డకు చెందిన వ్యక్తి నడుపుతున్నారని, అయితే స్థానిక చెంచులకు అప్పగించాలని కోరారు. మాజీ జడ్పీటీసీ, వీటీడీఏ ప్రెసిడెంట్ నారాయణమ్మ, కార్యదర్శి నిమ్మల హుశేని, ఉపాధ్యక్షుడు మండ్ల బయన్న పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత ప్రతిష్ఠ దినోత్సవం



చాగలమర్రి కన్యకాపరమేశ్వరి ఆలయంలో క్షీరాభిషేకం

చాగలమర్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని కన్యకాపరమేశ్వరిదేవి 90వ ప్రతిష్ఠ దినోత్సవం గురువారం ఆలయంలో వేద పండితుడు పెద్దశాస్త్రీ, ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, ధర్మకర్త శివప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహన్యాస రుద్రాభిషేకం, జల, పాలాభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి ప్రసాద్, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

● చాగలమర్రిలోని గాంధీబజార్‌లో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ దినోత్సవం గురువారం ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వీరాంజనేయస్వామి పతాకాన్ని ఆవిష్కరించారు. మహిళలు సామూహికంగా భజన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, ధర్మకర్త శివప్రసాద్, మల్లికార్జున, నవతా ప్రసాద్, సుబ్రమణ్యం, సుబ్బారావు పాల్గొన్నారు.

శిశు సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంరక్షణ అందరి బాధ్యతని ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్య సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సేవలు సక్రమంగా అందించి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు జరిగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, వైద్యులు ఇమ్రాన్, అంజలి, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యాన్సర్, ఎల్‌సీడీ, అంధత్వ సర్వేలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలను నమోదు చేయాలని అన్నారు. బీపీ, షుగర్‌తో పాటు పుట్టుకతో వచ్చే వ్యాధులను గుర్తించాలని చెప్పారు. కుష్ఠువ్యాధి నిర్మూలన అందరి బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, అంజలి, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వీవోఏల జిల్లా అధ్యక్షుడు నరసింహుడు

రుద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వీవోఏల సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు నరసింహుడు అన్నారు. గురువారం మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె సమీపంలోని గురప్పస్వామి టెంపుల్ వద్ద వీవోఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి పరిమితి రద్దు చేయాలని అన్నారు. వీవోఏలకు గౌరవ వేతనం బ్యాంకు ఖాతాలకు జమ చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోజుకో కొత్త యాప్ ఇస్తున్నందున వీవోఏలకు మొబైల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గురుస్వామి, సుభాష్, మరియమ్మ, శ్రీదేవి, నాగార్జున తదితరులు ఉన్నారు.

విధులు, బాధ్యతలపై శిక్షణ



మాట్లాడుతున్న కోర్స్ డైరెక్టర్ పరమేశ్వరుడు

ఉయ్యాలవాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీ స్వయం శక్తి సంఘాలకు సంబంధించిన మేట్‌లకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమా మహేశ్వ రరావు ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేశారు. కోర్సు డైరెక్టర్ పరమేశ్వ రుడు యాప్‌లో హాజరు విధానంపై అవగాహన కల్పించారు. అలాగే మేట్‌ల విధులు, బాధ్యతలను వివరించారు. కూలీలకు కనీస వేతనం రూ. 300 వచ్చేలా పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రవిప్రకాష్, ఈసీ షరీఫ్‌బాషా పాల్గొన్నారు.

చాగలమర్రిలో బైక్ గ్యారేజీ దగ్ధం

చాగలమర్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో గురువారం లాలు ఏర్పాటు చేసుకున్న బైక్ గ్యారేజీ దగ్ధమైంది. దీంతో బైక్‌లు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా, ప్రమాదవశాత్తు కాలిపోయాయా అన్నది తేలాల్సి ఉంది. మంటలు అధికంగా వ్యాపించడంతో పాత బైక్‌లన్నీ కాలిపోయి దాదాపు రూ.50 వేల దాకా నష్టం వాటిల్లింది. చుట్టుపక్కల ఉన్న వారు మంటలను ఆర్పి వేయడంతో ప్రమాదం తప్పింది.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

రుద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పనపల్లె గ్రామానికి చెందిన చెన్నకేశవుల జయలక్ష్మి (70) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ నెల 4వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి భర్త చిన్ననరసింహుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బాలన్న తెలిపారు.

40 ఏళ్ల కల.. నెరవేరిన వేళ

గుంప్రమాన్‌దిన్నె బీసీ కాలనీలో సీసీ రహదారులు

శిరివెళ్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంప్రమాన్‌దిన్నె గ్రామంలోని బీసీ కాలనీ ప్రజల 40 ఏళ్లనాటి కల నేటి కూటమి ప్రభుత్వ హయాంలో నెరవేరింది. బీసీ కాలనీలో సరైన రహదారులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత ఎన్నికల సమయంలో గ్రామ టీడీపీ నాయకుడు కుందూరు మోహన్‌రెడ్డి ద్వారా కాలనీవాసులు సమస్యను భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో సీసీ రహదారులు నిర్మించి మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నేడు నిలబెట్టుకున్నారు. దాదాపు రూ.25 లక్షల నిధులతో సీసీ రహదారులు నిర్మించడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.



గుంప్రమాన్‌దిన్నె బీసీ కాలనీలో నిర్మించిన సీసీ రహదారి

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చినందున తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ వసతి భవనంలో ఆయన మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు గ్రామాలు తిరిగి నీటి పథకాలను పరిశీలించాలని అన్నారు. ఏక్కడైన పథకాలు పని చేయకపోతే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఏ గ్రామంలోనైనా బోరు అవసర మైతే తనకు సమాచారం అందించాలన్నారు. అలాగే వాటర్‌గ్రిడ్ పథకం పూర్తి చేసి నీరు అందించడానికి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్ కుమార్‌రెడ్డి, ఏఈ మనోహర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, బాలక్రిష్ణుడు, వి. సుధాకర్‌రెడ్డి, ఎంఈవో వెంకటేశ్వరనాయక్, శివకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవానికి తరలి రండి : జనసేన



ఆళ్లగడ్డలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు



డోన్ జనసేన కార్యాలయంలో వాల్‌పోస్టర్ల విడుదల

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 6(ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో ఈ నెల 14వ తేదీన జరగబోయే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి జనసైనికులు తరలి రావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నయాబ్ కమల్ పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ఆళ్లగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త మైలేరి మల్లయ్య ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జనసేన పార్టీ దశాబ్ద కాలంపాటు ఎన్నో కష్టనష్టాలు భరించినప్పటికీ అధినేత పవన్ కల్యాణ్ స్ఫూర్తి, సమర్థతతో ముందుకు నడిపించారని.. నేడు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులుగా వ్యవహరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గుంటూరు నగర కార్యదర్శి ప్రసాద్‌రావు, పిడతల సుధాకర్, మాబు హుసేన్, నరేంద్ర యాదవ్, బాబు, బ్రహ్మేంద్ర కుమార్, గుర్రప్ప, శివ, నాగేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

14న జనసేన ఆవిర్భావ సభ

డోన్ టౌన్: పిఠాపురంలో ఈ నెల 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేద్దామని జన సేన రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమల్, డోన్ నియోజకవర్గ సమన్వయ కర్త గడ్డం బ్రహ్మం పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని జనసే న కార్యాలయంలో జనసేన ఆవిర్భావ సభ గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం కమిటి సభ్యులు నాగరాజు, వీర మహిళా చాముండేశ్వరి, చల్లా మద్దిలేటి స్వామి, శ్రీకంటి మధు, మనోజ్, మధు నాయుడు, చంద్ర, సునీల్, మౌలాలి, గణేష్, పుల్లయ్య, ఆర్య, వీరయ్య, జయచంద్ర సాయి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి నయాబ్‌కమాల్ అన్నారు. బనగానపల్లె కోఆర్డినేటరు పత్తి సురేశ్ బాబు ఆధ్వర్యంలో కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు ఆవరణలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గ నాయకులు పిడతల సుధాకర్, బనగానపల్లె నియోజకవర్గ నాయకులు భాస్కర్, దొడియం గురప్ప, నాగప్రసాద్, చెన్నకెట్టు బోధనం ఓబులేసు, విజయ్, కొలిమిగుండ్ల మండల నాయకులు పృథ్వి పెద్దయ్య, అవుకు మండల నాయకులు అజిత్‌రెడ్డి, జనార్దన్, బనగానపల్లె మండల నాయకులు ప్రసాద్, కాసిం షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డా.కాంతారావు నాయక్

బేతంచెర్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సిమెంటు నగర్ గ్రామంలోని ప్రభుత్వాసుపత్రిని ఎన్‌సీడీసీడీ సర్వే జిల్లా నోడల్ అధికారి డా.కాంతారావు నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది నాణ్యమైన సర్వే చేయాలని అన్నారు. అసంక్రమణ వ్యాధులు గుర్తించే గృహ సర్వేలో అనుమానిత క్యాన్సర్ కేసులను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నంద్యాలకు పంపాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డా.మెహతాబ్, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్ సువర్ణ, రాజేశ్వరి, ఏఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

బనగానపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ సెంటర్‌లో అసిస్టెంట్ టెక్నీషియన్ కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సుకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లలిత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ పదో తరగతి ఆపై చదివినవారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో తమ పేర్లను రిజిష్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు నిరుద్యోగ యువతీ యువకులు బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

కొలిమిగుండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వెనుబడిన తరగతుల కో-ఆపరేటివ్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొలిమిగుండ్ల ఎంపీడీవో ప్రసాదరెడ్డి గురువారం వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వెనుబడిన తరగతుల కమ్మ, రెడ్డి, కాపు, ఈ-బీసీ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ వర్గాల వారు అర్హులన్నారు. 18నుండి 50సంవత్సరాల లోపు వయస్సున్న మహిళలకు మాత్రమే ఈశిక్షణా తరగతులు ఉంటాయన్నారు. 45, 60, 90రోజుల బేసిక్ టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

దాహం తీర్చటం వరంగా భావించాలి



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

ఉయ్యాలవాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రయాణికుల దాహం తీర్చటం వరంగా భావించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మాయలూరు గ్రామ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణి కులకు దాహార్తి తీర్చేందుకు గ్రామస్తులంతా కలిసి చలివేంద్రం ఏర్పా టు చేయటం అభినందనీయమన్నారు. ఈ వేసవిలో చలివేంద్రాలు ప్రయాణికులకు ఉపశమనం కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఈడిగె రవి, రామాంజనేయరెడ్డి, పుల్లయ్య ఉన్నారు.

పని వేళలు పాటించాలి

రుద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రమణ్యం అన్నారు. గురువారం మండలంలోని యల్లావత్తుల గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. పీ4 సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుబ్బారావు, కార్యదర్శి పాములేటి పాల్గొన్నారు.

అడవికి నిప్పుతో ముప్పు

రుద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అడవికి నిప్పు మానవాళికి ముప్పు అని శ్రీమంజుభార్గవి కళాజాతా బృందం కళాకారులు గురువారం రాత్రి మండలంలోని రెడ్డిపల్లెలో కళాజాతా నిర్వహించారు. కళాజాతా బృందాల చేత రేంజ్‌లోని నల్లమల తీర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు రేంజర్ శ్రీపతి నాయుడు తెలిపారు. అడవులను రక్షించడం మనందరి బాధ్యత అన్నారు. వన్యప్రాణులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

చాగలమర్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలపై పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగసేతాజీ తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు చీడపీడలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్లే అధిక లాభాలు సాధించవచ్చని అన్నారు. 6వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఏ-4 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల అన్నారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని అన్నారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను నీడ ఉండే ప్రదేశాల్లో ఉండేలా చూడాలని సూచించారు.

పీ-4 సర్వే చేపట్టాలి

చాగలమర్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ-4 సర్వేను సచివాలయ సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగా ఇంటింటి సర్వే చేస్తున్నామని అన్నారు. సర్వేలో కుటుంబాల పూర్తి వివరాలు ఉంటాయని అన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో సాయినాథుడి అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. రుద్రవరంలో పూలమాలతో సాయినాథుడి చిత్రపటాన్ని అలంకరించారు. తరలివచ్చిన భక్తులు సాయినాథుడి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలి

● డోన్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి



అతిథులను సన్మానిస్తున్న అంగన్‌వాడీ, సిబ్బంది

డోన్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు అంగన్‌వాడీ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలని డోన్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి అన్నారు. గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో శంషాద్‌బేగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా న్యాయాధికారి తంగమణి తోపాటు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా, ఎంఈవో ప్రభాకర్, ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే మంచి చెడులపై అవగాహన కల్పించాలన్నారు. మహిళలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే.. మహిళా కమిషన్‌కు, పోలీసులకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం అతిథులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

వరప్రదాయిని దద్దనాల ప్రాజెక్టు : బీసీ రాజారెడ్డి



దద్దనాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పడమటి పల్లెల జల వరప్రదాయిని దద్దనాల ప్రాజెక్టు అని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. మండలంలోని పాతపాడు గ్రామ సమీపంలోని దద్దనాల ప్రాజెక్టును గురువారం ఆయన సందర్శించారు. అలాగే ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. దద్దనాల ప్రాజెక్టులో నీటి పంపింగ్ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో భూషన్న, బాలనాయుడు, నాయక్, విష్ణువర్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా



మస్తాన్‌స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు దంపతులు

దొర్నిపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. గురువారం గ్రామంలో మస్తాన్‌స్వామి కందూరును గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు మధుసూన్‌రావుతో కలిసి అభిరుచి మధు హాజరయ్యారు. వీరికి లాయర్ కాకర్ల రమేష్‌చౌదరి ఆధ్వర్యంలో గజమాల వేసి మేళతాళాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో లాయర్ కాకర్ల రమేష్‌చౌదరి, సర్పంచ్ గుండ్రాతి బాలసుబ్బయ్య, కూటమి నాయకులు భూపనపాటి శేఖర్, భాస్కర్ నాయుడు, రాంభూపాల్, పుల్లారెడ్డి, శంకర్‌రెడ్డి, చాకరాజువేముల కేసీ కెనాల్ సాగునీటి సంఘం అధ్యక్షుడు లింగుట్ల వెంకట్‌నాయుడు, డీలర్ రమణయ్య, దస్తగిరి, ఓబులేసు ఉన్నారు.

ప్రతాప రుద్రేశ్వరాలయానికి విరాళం



రూ.లక్ష విరాళం ఇస్తున్న శ్రీనివాసులు దంపతులు

రుద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని పడమటి వీధిలో ఉన్న ప్రతాప రుద్రేశ్వరస్వామి వారి సాలాహారానికి రూ.లక్షను విరాళాన్ని నంద్యాలకు చెందిన అలువ శ్రీనివాసులు, సరస్వతి దంపతులు అందించినట్లు గురువారం కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతాపరుద్రేశ్వరస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేశారని వారు తెలిపారు. దేవుని సాలాహారం తయారీకి విరాళం అందించడం సంతృప్తిగా ఉందని దంపతులు తెలిపారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

డోన్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.శివరాం డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీడీపీవో శంషాద్ బేగంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 10న విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నక్కి శ్రీకాంత్, సీఐటీయూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు షేబారాణి, జులైఖ, ఎస్తేరమ్మ, సుమలత, రహమత్‌బీ, గుల్జార్బీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నాటుసారా సీజ్.. నిందితుల అరెస్టు

డోన్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బేతంచెర్ల పట్టణంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి నాటుసారా విక్రేతలను అరెస్టు చేశారు. వారి నుంచి 90 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. బేతంచెర్ల పట్టణానికి చెందిన రాముడు, ఆలేబాదు తండాకు చెందిన భీముడు నాయక్ నాటుసారా విక్రేతలను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐలు లక్ష్మణదాసు, ఎస్ఐలు రమేష్, దౌలత్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం

డోన్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పాత కేసులలో పట్టుబడిన మద్యం, నాటుసారాను గురువారం ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. పట్టణ సమీపంలోని నిర్జీవ ప్రదేశంలో మద్యం బాటిళ్లను, నాటుసారా ప్యాకెట్లను వాహనంతో తొక్కించి కాల్చివేశారు. దాదాపు 143 కేసుల్లో సీజ్ చేసిన మద్యంను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.2 లక్షలకు పైగా ఉంటుందన్నారు.

నాలుగు సెంటర్లలో పది పరీక్షలు

కొలిమిగుండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండలంలో మొత్తం నాలుగు సెంటర్లలో పది పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 634 మంది పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. మండలంలో కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్, అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల, తిమ్మనాయునిపేట ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.